మిత్రులే ప్రత్యర్థులు

కడియం కావ్య (కాంగ్రెస్)

మారేపల్లి సుధీర్ బాబు (బీఆర్ఎస్)

అరూరి రమేష్ (బీజేపీ)

- నాడు బీఆర్ఎస్ లో నేడు వేర్వేరు పార్టీల్లో..
- ప్రధాన పోటీదారుల్లో ఇద్దరు డాక్టర్లు, ఓ కాంట్రాక్టర్
- వేడెక్కిన వరంగల్ రాజకీయం
- తేలిన వరంగల్ లోకసభ ప్రధాన పార్టీల ముఖ చిత్రం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః రాష్ట్రంలో ఏ నియోజక వర్గంలో లేని విధంగా వరంగల్ లోకసభ నియోజకవర్గం ఉంది. ఇక్కడి రాజకీయ పరిస్థితులు ఎంతో రసవత్తరంగా మారాయి. సార్వత్రిక ఎన్నికల వేళ ఈ స్థానం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపిక కూడా గందరగోళ పరిస్థితుల మధ్య జరిగింది. ఎప్పుడు ఎవరు ఏ పార్టీ కండువా కప్పుకుంటారో తెలియక రాజకీయ వర్గాలు ఎవరికి వారు ఎత్తుగడలు వేస్తున్నారు. ఎట్టకేలకు బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్ కుమార్ ను శుక్రవారం ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరో తెలిసిపోయింది. ఇప్పటికే కాంగ్రెస్ నుంచి కడియం కావ్య , బిజెపి నుంచి ఆరూరి రమేష్ పేర్లు ఖరారయ్యాయి. కాంగ్రెస్, బిజెపి. బీఆర్ఎస్ అభ్యర్థులు గతంలో ఒకే పార్టీలో కలిసి పనిచేసిన వారే. నాడు బీఆర్ఎస్ లో కలిసి పనిచేసిన మిత్రులు నేడు ప్రత్యర్థులుగా మారిపోయారు. దీంతో వరంగల్ లోకసభ నియోజకవర్గ ప్రజలు, రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల ముఖచిత్రాలు తేలిపోయ్యాయి.

నాటకీయ పరిణామాలు..

పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు కూడా ముగ్గురు ప్రత్యర్థులు బీఆర్ఎస్ లోనే ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ టికెట్ కోసం ప్రయత్నించారు. మొదటి నుంచి ఆయన పేరు పరిశీలనలో ఉంది. అంతలోనే పార్టీ అంతర్గత రాజకీయాలతో రమేష్ పేరును పక్కనబెట్టారు. దీంతో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య పేరు తెర పైకి వచ్చింది. అసంతృప్తికి లోనైన రమేష్ బిజెపిలో చేరడానికి సిద్ధమయ్యారు. నేడో రేపో చేరిపోతారనగా రమేష్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ విషయం తెలిసిన బీఆర్ఎస్ అధిష్టానం సమావేశం జరగకుండా అడ్డుకుంది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, నాగుర్ల వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ సారయ్య తదితరులను రంగంలోకి దింపారు. వీరంతా రమేష్ వద్దకు వెళ్లి బలవంతంగా వాహనాల్లో ఎక్కించుకుని నేరుగా కేసీఆర్ వద్దకు తీసుకెళ్లారు. మార్గమధ్యంలో వాహనాన్ని బిజెపి శ్రేణులు అడ్డుకున్నాయి. కేసీఆర్ తో చర్చలు జరిగాక తాను టికెట్ నిరాకరిస్తున్నట్లు ఆరూరి ప్రకటించడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ సంఘటన జరిగిన రెండు రోజులకే ఆరూరి రమేష్ కాషాయం కండువా కప్పుకున్నారు. వెంటనే రమేష్ కు వరంగల్ టికెట్ ను బిజెపి కేటాయించడం చకచకా జరిగిపోయాయి.

కాంగ్రెస్ సీనియర్లలో అసంతృప్తి

బిజెపి అభ్యర్థిగా ఆరూరి రమేష్ పేరు ఖరారు కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థినిగా కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య పేరు గులాబి పార్టీ ప్రకటించింది. రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరో తెలిసిపోయింది. మిగిలిన కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో ఎవరు ఉంటారో ప్రకటించాల్సి ఉంది. ఇంతలోనే కడియం కావ్య రాత్రికి రాత్రే తండ్రి శ్రీహరి తో కలిసి హస్తం పార్టీలోకి జంప్ అయ్యారు. ఈ సంఘటన రాజకీయంగా విపరీత దోరణులకు ఉదాహరణగా మారింది. బీఆర్ఎస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. వరంగల్ లో జరిగిన రాజకీయ మార్పులు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. అందరి చూపు ఓరుగల్లు వైపు పడింది. రాజకీయంగా రసవత్తర చర్చ జరిగింది. కాంగ్రెస్ తీర్థం తీసుకున్న కావ్యకు వరంగల్ టికెట్ ను ఆ పార్టీ ప్రకటించింది. శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. అభ్యర్థిత్వం ఖరారయ్యాక కూతురు తండ్రితో కలిసి పార్టీ మారడం వరంగల్ చరిత్రలో మొదటిసారని రాజకీయ శ్రేణులు చెపుతున్నారు. కాంగ్రెస్ లో చేరినప్పటికి ఆ పార్టీలో ఎప్పటి నుంచో పనిచేస్తున్న సీనియర్ నేతలు అసంతృప్తికి లోనయ్యారు. ఆమె గెలుపు కోసం పని చేయడానికి నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతల్లో ఇంకా అసంతృప్తి జ్వాలలు కొనసాగుతున్నాయి. అందరిని కలుపుకుపోవడానికి తండ్రి కూతుర్లు తలలు పట్టుకుంటున్నారు. కాంగ్రెస్ టికెట్ కోసం దొమ్మటి సాంబయ్య, ఇందిర, పరంజ్యోతి, నమిండ్ల శ్రీనివాస్ తదితరులు పోటీపడ్డారు.

డాక్టర్ కే టికెట్ కేటాయించాలని..

కడియం కావ్య నిర్ణయంతో బీఆర్ఎస్ ఆచితూచి అడుగేసింది. ఎట్టకేలకు చివరకు హనుమకొండ జిల్లా పరిషత్ ఛైర్మన్ సుధీర్ కుమార్ పేరును ప్రకటించారు. పెద్ది స్వప్న, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, డాక్టర్ సుగుణాకర్ రాజు, జోరిక రమేష్, బోడ డిన్న, డాక్టర్ సుధీర్ కుమార్ తదితరుల పేర్లను పరిశీలించారు. కడియం కావ్య డాక్టర్ కావడంతో డాక్టర్ నే బరిలో నిలపాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. అందులో భాగంగా జనగామ జిల్లాలో పని చేస్తున్న డాక్టర్ సుగుణాకర్ రాజును పేరును పున: పరిశీలించారు. తాటికొండ పేరు సైతం బాగానే చర్చకు వచ్చింది. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న పార్టీ అదిష్టానం డాక్టర్ సుధీర్ కుమార్ ను బరిలో దింపింది.

వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్ కుమార్

వరంగల్ ఎంపీ స్థానం నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ ను అధినేత కేసీఆర్ ప్రకటించారు. హనుమకొండ జిల్లా వాసి, మాదిగ సామాజిక వర్గానికి చెందిన సుధీర్ కుమార్ హనుమకొండ జెడ్పీ ఛైర్మ న్ గా కొనసాగుతున్నారు. 2001 నుంచి ఉద్యమకారుడిగా, పార్టీకి విధేయుడుగా, అధినేతతో కలిసి పనిచేస్తున్న సుధీర్ సరైన అభ్యర్థిగా పార్టీ ముఖ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మేరకు కేసీఆర్ అందరితో చర్చించి వారి సలహా సూచనల మేరకు సుధీర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి ప్రకటించారు.

గడువులోగా బయోమైనింగ్ పూర్తి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- క్షేత్ర స్థాయి లో బయోమైనింగ్ ప్రక్రియ పరిశీలన
- ప్రశాంత్ నగర్ లో ఎస్టీపీ సందర్శన

రాంపూర్ డంపింగ్ యార్డులో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న బల్దియా కమిషనర్

అక్షర దర్బార్, వరంగల్: నిర్దేశిత గడువులో బయోమైనింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె రాంపూర్ డంపింగ్ యార్డులో క్షేత్ర స్థాయిలో పర్యటించి కొనసాగుతున్న బయోమైనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జూన్ మాసాంతానికి బయోమైనింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, 3 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు లక్ష 87 వేల మెట్రిక్ టన్నుల చెత్త ప్రాసేసింగ్ మాత్రమే పూర్తి చేయడం జరిగిందని, ప్రతిరోజు 2 మెట్రిక్ టన్నుల చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధం గా వ్యవహరిస్తూ గడువు లోగా పూర్తి చేయాలని అన్నారు. ప్రతిరోజు పూర్తి చేసిన చెత్త ప్రాసెసింగ్ సంబంధిత సమాచారాన్ని (నివేదికను) అందజేయాలని, బల్దియా వ్యాప్తంగా ఉన్న 66 డివిజన్ల నుండి చెత్తను సేకరించి డంప్ యార్డ్ కు తరలించే క్రమంలో రోడ్డు పైన చెత్త పడకుండా ఉండేలా వాహనాలపై కవర్లను ఏర్పాటు చేసేలా చూడాలని ముఖ్య ఆరోగ్యాదికారిని ఆదేశించారు. అనంతరం ప్రశాంత్ నగర్ లో 15 ఎంఎల్డి సామర్థ్యంతో నిర్వహిస్తున్న సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టిపి)ని కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, ట్రీట్మెంట్ పనితీరు విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు కమిషనర్ కు ప్లాంట్ పనితీరును వివరిస్తూ ప్రతి రోజూ 5 ఎంఎల్ డి మురికి నీటిని శుద్ధికరిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ వెంట ముఖ్య ఆరోగ్య అధికారి డా. రాజేష్, ఎస్ ఇ ప్రవీణ్ చంద్ర, ఈఈలు రాజయ్య, సంజయ్ కుమార్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి, సానిటరీ సూపర్వైజర్ పసునూరి భాస్కర్ సానిటరీ ఇన్ స్పెక్టర్ కుమారస్వామి పాల్గొన్నారు.

గ్లూకోస్ బాటిల్ లో నాచు

దంతాలపల్లిలో ఘటన

అక్షర దర్బార్, దంతాలపల్లి: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్లూకోస్ బాటిల్ లో నాచు వచ్చిన ఘటన కలకలం సృష్టించింది. దాట్ల గ్రామానికి చెందిన నరకుటి సునీత అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ దంతాలపల్లి ఆరోగ్య కేంద్రానికి చేరుకుంది. ఆసుపత్రిలో సిబ్బంది ప్రస్తుతం డాక్టర్ అందుబాటులో లేరని, ఇంటికి వెళ్లి పెట్టించుకోమని రెండు గ్లూకోజ్ బాటిల్స్ బాధిత మహిళకు సిబ్బంది అందజేశారు. బాధిత మహిళ ఇంటికి వచ్చి ఆర్ఎంపీ డాక్టర్ దగ్గరకు వెళ్ళగా గ్లూకోస్ బాటిల్ లో నాచు ఉండటంతో అవాక్కయిన మహిళ విషయాన్ని ఆసుపత్రి సిబ్బంది దృష్టికి తీసుకెళ్ళింది. జిల్లా అధికారులు సంబంధిత విషయం విచారణ జరిపి ఈ నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు.

చెరువులో యువకుడి మృతదేహం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : చెరువులో యువకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. రంగశాయిపేటకు చెందిన మచ్చ రాజు (19) గురువారం ఉదయం వాకింగ్ వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడ్డ కుటుంబసభ్యులు వెతుకులాట ప్రారంభించారు. అదే సమయంలో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సెల్ లోకేషన్ ఆదారంగా గణపతి కాలేజీ సమీపంలోని చెరువులో రాజు శవాన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. చెరువులో పడి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఇంటర్ పూర్తి చేసిన రాజు బుధవారం ఇంట్లో జరిగిన గొడవకు మనస్థాపం చెంది ఈ చర్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు.